ఎస్పీకి శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్: జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఎస్పీ బంగళాలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

వైవీయూ : వైవీయూ బయోటెక్నాలజీ మష్రూమ్ కల్టివేషన్ సెంటర్ కోఆర్డినేటర్ ఆచార్య చంద్రమతీశంకర్ ఆధ్వర్యంలో గురువారం పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. జమ్మలమడుగు డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు విచ్చేసి శిక్షణ పొందారు.

ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట.. అందాల మూట


ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట సొగసు చూడతరమా..


గుంజోయి.. వల విసిరి

జల జల పారుతున్న జలం.. అందులో ఈత కొడుతున్న చేపలు.. వాటిని పట్టుకోవడానికి వల వేస్తున్న మత్స్యకారులు.. ఇలాంటి సుందర దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో.. ఆదినిమ్మాయపల్లెకు భారీగా వరదనీరు వస్తోంది. ఆనకట్ట అలుగు పారుతోంది. వెరసి అక్కడ మత్స్యకారుల సందడి నెలకొంది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప


మత్స్య వయ్యారం


అక్కడే కటింగ్.. విక్రయం

ఘనంగా హిందీ దివస్

వైవీయూ : కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో గురువారం హిందీ దివస్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ హిందీభాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం హిందీ అధ్యాపకులను సన్మానించారు.

హిందీ భారతీయ సాంస్కృతిక వారధి

కడప ఎడ్యుకేషన్: హిందీభాష భారతీయ సాంస్కృతిక వారధి అని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షులు ఎఫ్ఎంఎస్ ఖాదర్ అన్నారు. హిందీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు(ఆర్‌యూపీపీ) గురువారం కడప నగరం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్, చెమ్మియాపేట బాలికల హైస్కూల్, ఆలంఖాన్ పల్లె జెడ్పీ హైస్కూళ్లలో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

కడప అర్బన్: ప్రశాంత వాతావరణంలో ప్రజలు పండుగలు జరుపుకోవాలని పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. కడప ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్, తాలూకా, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌ల ఆవరణంలోనే పోలీసు అధికారులు... హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన వారితో సమావేశమయ్యారు. వినాయక చవితి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


మృతి చెందిన రామ్‌కుమార్


పెంచలయ్య


తీవ్రంగా గాయపడిన మల్లేష్


పోలీసులు అదుపులోకి తీసుకున్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు

అట్లూరు : బద్వేలు మండలం కొంగలవీడు గ్రామ సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్లూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అట్లూరు మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన రామ్‌కుమార్ (50), పెంచలయ్య (42), నల్లగొండుగారిపల్లె కాలనీకి చెందిన మల్లేష్ ముగ్గురూ కలసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. బద్వేలు నుంచి మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో రామ్‌కుమార్, పెంచలయ్య, మల్లేషలు కిందపడిపోయారు. అదే సమయంలో బద్వేలు నుంచి కడపకు వెళుతున్న గుర్తు తెలియని లారీ రామ్‌కుమార్, పెంచలయ్యపైకి ఎక్కడంతో వారిరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మల్లేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలపాలైన మల్లేష్‌ను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బద్వేలు అర్బన్, రూరల్, అట్లూరు పోలీసులు అప్రమత్తమై అట్లూరు పోలీసుస్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి, వారిపై ఎక్కి వెళ్ళిన లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే మొదటగా ఢీకొట్టిన ద్విచక్ర వాహనం ఎవరిదనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎంను కలిసిన యానాదయ్య

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టీటీడీ బోర్డు సభ్యులు ఎస్.యానాదయ్యతోపాటు కుటుంబ సభ్యులు కలిశారు. గురువారం వారు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్యమంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యానాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారి నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న యానాదయ్య కుటుంబ సభ్యులు

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి

కడప కార్పొరేషన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు కృషి చేయాలని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఐఎంఏ హాలులో వైఎస్సార్ జిల్లా వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శివానాయక్ ఆధ్వర్యంలో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, నంద్యాల, సత్యసాయి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడి ప్రాణదాతగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏవైనా సమస్యలు ఉంటే అందుకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, వారణాసి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్‌సొహైల్ అహ్మద్, పవన్ పాల్గొన్నారు.


జగనన్న సురక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప డీఎస్ఏ క్రీడామైదానం, వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం కడప మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు నిర్వహించారు. కడప ఎంఈఓ పాలెం నారాయణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి, కడప మండల ఎస్‌జీఎఫ్ బాధ్యులు బి. నిత్యప్రభాకర్ మాట్లాడుతూ వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. ప్రవీణ్‌కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీడీసీ కార్యాలయం తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని కళాశాలల అభివృద్ధి మండలి (సీడీసీ) కార్యాలయాన్ని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఉద్యోగుల హాజరు, రికార్డులను ఆయన పరిశీలించారు. డిగ్రీ, బీఈడీ, లా కళాశాలల రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ చొరవతోనే...

కడప ఎడ్యుకేషన్: కడప టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పరిధిలో 1434 మంది ఉపాధ్యాయులకు చెందిన పబ్బాపురం టీచర్స్ స్థలాలు భూ కబ్జాదారుల నుంచి రక్షించుకోవడానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చూపిన చొరవతో ఉన్నతాధికారుల స్పందన అభినందనీయం అని కడప టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్బాపురం టీచర్స్ ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రూరల్ సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి సస్పెండ్ అయ్యారని గుర్తు చేశారు. టీచర్స్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ అక్రమాలలో అధికార పార్టీ నేతల హస్తం లేదన్నారు.

భుజం కీలు మార్పిడి సర్జరీ విజయవంతం

కడప రూరల్: కడప నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద గల జేబీ ఆసుపత్రిలో భుజం కీలు మార్పిడి సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కీళ్ల మార్పిడి వైద్యులు జహంగీర్‌బాష మాట్లాడుతూ పులివెందులకు చెందిన 65 ఏళ్ల అమ్మణ్ణికి భుజం కీలు అరిగిపోవడంతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి భుజం కీలు మార్పిడి సర్జరీని విజయవంతంగా నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో ఆ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఏ జయభారతి, డాక్టర్ ఉబేదుల్లా ,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సర్జరీ గురించి వివరిస్తున్న వైద్యులు

నేత్ర పరీక్షలు

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. సంస్థ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చిన్నపరెడ్డి, అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ నేత్ర సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రాథమిక చికిత్స అందించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. నేత్ర వైద్యులు శశిబిందు 100 మందికి పైగా విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

వైవీయూ : పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని వైవీయూ ఆంగ్లశాఖ ఆచార్యులు డా. పుత్తా పద్మ సూచించారు. బుధవారం కడప నగరంలోని యూత్ హాస్టల్‌లో హిందీ దివస్, జాతీయ నాయకులకు నివాళులర్పించే కార్యక్రమం, పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆచార్య పద్మ మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీన పార్లమెంట్‌లో మన జిల్లా నుంచి యువత వాణి వినిపించాలని ఆకాంక్షించారు. నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలు రాష్ట్రస్థాయి, ఆ తర్వాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అక్కడ రాణించిన వారికి పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రశాఖ అధ్యాపకుడు బాలగొండ గంగాధర్ మాట్లాడారు. అనంతరం పోటీలు నిర్వహించారు.

స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన

వైవీయూ : విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడపలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఎంపికలకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.థామస్, కార్యదర్శి ఎం.సుధీర్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 16 న కదిరిలో నిర్వహించే జోనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ హరి పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : కె.సి.మైఖెల్ జాన్సన్, వై.సునీల్‌కుమార్, సి.హెచ్.వరకుమార్, బి.రంగస్వామి, ఎస్.ముక్తియార్, ఎస్.కె.గైబు, బి.సునీత్, బి.జె.వెస్లీ, పరమేష్, కె.సంజు, జె.బన్నీ, ఎస్.బాషా, ఎం.రాఘవేంద్ర, వి.జె.బ్రెట్లీ, కె.హరీష్, ఎస్.కె.మహమ్మద్, ఎస్.బాలాజీ, వై.కృష్ణ, బి.పూజిత్, ప్రకాష్, సి.వెంకటశివ, వి.సలీంరాజు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

మహిళల అభ్యున్నతే సీఎం లక్ష్యం

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: మహిళలను ఆర్థికంగా మహారాణులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 25వ డివిజన్‌లోని రాధాక్రిష్ణ నగర్, నమస్తేబోర్డు వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందిన లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం మహిళలకే ఇవ్వడం జరుగుతోందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, ఇంటి స్థలం వంటి అన్ని పథకాలు మహిళలకే ఇస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, కో ఆప్షన్ సభ్యురాలు పత్తిరాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివకేశవ, బాలక్రిష్టారెడ్డి, బండి బాబు, త్యాగరాజు, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, పవర్ అల్తాఫ్, ఇలియాస్, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు పాల్గొన్నారు.


ప్రజలకు పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అప్రోచ్ రోడ్లను పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: బుగ్గవంక ఆనుకుని ఉన్న 40 రోడ్లను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించారు. బుగ్గవంక పరిసర ప్రాంతాల్లో 40 రోడ్లు నిర్మించేందుకు వీలుగా ఆక్రమణలు తొలగించి, డ్రైనేజీ కాలువలను లెవెల్స్ ఆధారంగా నిర్మించాలన్నారు. అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించాలన్నారు. అక్కాయపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. భగత్ సింగ్ నగర సమీపంలో ఫుడ్ ప్లాజా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన రిమ్స్ సమీపంలోని జర్నలిస్టుకాలనీ పార్కు పనులను పరిశీలించారు. త్వరలోనే పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, హార్టికల్చర్ ఏడీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అన్నమయ్య డీఎఫ్ఓ వివేక్‌పై దాడి అమానుషం

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్‌పై కొంత మంది దాడి చేయడాన్ని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ కడప యూనిట్ వారు తీవ్రంగా ఖండించారు. గురువారం కడపలోని పంచవటి ఫారెస్ట్ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. నాగరాజు, సెక్రటరీ ఎస్.శ్రీనివాసులు మాట్లాడారు. సాక్షాత్తు జిల్లా కలెక్టరేట్‌లోనే జిల్లా స్థాయి అధికారికి రక్షణ లేకపోతే కింది స్థాయి అటవీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఏవిధంగా ఉద్యోగ నిర్వహణ చేయాలని అన్నారు. డీఎఫ్ఓపై దాడి చేసిన వారిపై చట్టాల ప్రకారం కఠినమైన శిక్షలు విధించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌లు రాజు, ఎస్.రాజశేఖర్ రాజు, జాయింట్ సెక్రటరీ ఎస్.ఖాను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భాష అమలుకు కృషి

కడప కల్చరల్ : మన జాతీయ భాష హిందీ అమలుకు కంకణ బద్ధులమవ్వుదామని ఎల్ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ పిలుపునిచ్చారు. గురువారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో బీమా పక్షోత్సవాల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. రీజినల్ మేనేజర్ జి.మధుసూదన్, మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్‌రావు, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


18న రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: వినియోగదారులపై విద్యుత్ ఛార్జీల భారం మోపే చర్యలను ఆపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.











'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేయాలి

– మేయర్ కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ కె. సురేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. అలాగే ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వ్యాధులు ఉన్నవారిని గుర్తించి నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ స్థాయిలో నిర్వహించామని, ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తామన్నారు. కడపలో 13 యూపీహెచ్‌సీలు ఉన్నాయని, వాటి పరిధిలో ఈ శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. కడప నగరంలో ఈనెల 30వ తేది ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని, దానికి 15 రోజుల ముందు సర్వే మొదలు కానుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎం విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, హీమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, కళ్ల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. శిబిరం నిర్వహించే రోజు వారందరికీ మందులు ఉచితంగా అందిస్తామన్నారు. ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరమైతే మంచి ఆసుపత్రులకు రెఫర్ చేస్తామన్నారు. దీన్ని ప్రజలంతా వినియోగించుకునేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాకా సురేష్, సానపురెడ్డి శివకోటిరెడ్డి, ఎం. సుబ్బారెడ్డి, కె. బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

'గాడిచర్ల'కు ఘన నివాళి


గాడిచర్ల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంథాలయ ఉద్యమనాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి నిర్వహించారు. వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది ముందుగా గాడిచర్ల చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం మూల మాట్లాడుతూ తెలుగు నేలలో ఆయనే తొలి తెలుగు రాజకీయ ఖైదీ అని, చిలుకూరి నారాయణరావు దత్తమండలాలకు 'రాయలసీమ' అనే పేరును సూచించగా, గాడిచర్ల దాన్ని బలపరిచారన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి , మరో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి , లైబ్రరీ అసిస్టెంట్ హరిభూషణరావు, ఎస్.రమేష్‌రావు కూడా మాట్లాడారు. బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ బ్రౌన్ కేంద్రంలో గాడిచర్ల చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

– జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ గురువారం 'గాడిచర్ల' జయంతిని పురస్కరించుకుని కొండాయపల్లెలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు.

దుప్పట్లు పంపిణీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : హాస్టల్ విద్యార్థులకు వెంటనే దుప్పట్లు పంపిణీ చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్ కోరారు. గురువారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.





























నేడు గ్రీవెన్స్ డే

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో బిల్డింగ్ ప్లాన్ అనుమతులకు సంబంధించిన సమస్యలపై శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు డీసీపీ సూరజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, సమస్యలున్నవారు వాటిని తెలిపి పరిష్కారం పొందవచ్చన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించాలని సంఘ సేవ కులు సయ్యద్ సలా ఉద్దీన్ పేర్కొన్నారు. స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కడప శివార్లలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో సలా ఉద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖీస్‌ఖాన్‌తో కలిసి మొక్కలు నాటారు.







